సామాజిక స్పృహగల రచయితగా మీ అభిమాని. మాజీ కొలీగ్‌కు ఈ మాత్రం సహాయం చేయడం మీ విధి. మీ సమాధానంతో పాటు, డిపాజిట్టు రుసుముకై నిరీక్షిస్తూ... మీ అభిమాన పాఠకుడు వైద్యభూషణ చంపే శ్రీ"

నా కథకు యాభై రూపాయల ప్రోత్సాహక బహుమతి రావడమే మోగానీ ఇలాంటి అభిమానుల' దాడికి తట్టుకోలేకుండా ఉన్నాను.

పది సంవత్సరాల నుండి కథలు రాస్తున్నాను. ఎన్నో పోటీల్లో పాల్గొన్నాను. నా కథకు బహుమతి రావడం మాత్రం ఇదే మొదటిసారి. నా ఆనందానికి అంతులేదు. ఆ సంచిక వంద కాపీలుకొన్నాను. వాటికి వేయి రూపాయలు, పోస్టేజికి మరోనాలుగు వందలు తగలేసి నా బంధుమిత్రులకు ఉగాది కానుకగా పంపాను. 'బహుమతి' మొత్తం ఎంతనికాదు, నీకు అఖిలాంధ్ర పాఠకుల్లో వచ్చిన గుర్తింపు ముఖ్యం. మాకు మందు పార్టీ ఇవ్వాల్సిందే' అన్న కార్యాలయ సహచరుల ఒత్తిడికి తలొగ్గి మరో రెండు వేలు వదిలించుకున్నాను.

నా కష్టాలు అంతటితో ఆగితే ఈ విషయాలు మీతో పంచుకునే అవసరం ఉండేదికాదు. నా ఈ కరుణ గాథను చదివి నన్నో పిచ్చివాడికింద జమ కట్టి నవ్వు కుంటారో, గుప్పెడు సానుభూతి ఒలకబోస్తారో, మీఇష్టం. నా ప్రాప్తం. అవధరించండిక నా కలంశోష.

స్వతహాగా భోలాశంకరున్నవడం వల్ల 'చంపేశ్రీ'గారికి ఏదో సహాయం చేద్దామని, మా సంస్థ ఖాతాదారుతో మాట్లాడి ఏజెన్సీ తీసుకోవడానికి ఒప్పించాను. వారు, వారి బ్రాంచి ద్వారా వాకబు చేస్తే చంపేశ్రీ అన్న ప్రబుద్ధుడు బ్యాంకులో కోటి రూపాయలకు పైగా ఫ్రాడ్ చేసి, సస్పెండై ఆ తర్వాత ఉద్యోగం కోల్పోయాడట. ఇక అతని మందులు నకిలీవనీ పైగా ఆరోగ్యానికి హానికరమని మార్కెట్టు రిపోర్టు. బాధితులు ఆ కంపెనీపై దావాలు కూడా వేశారని తెలిసింది. అలాంటి మందుల కంపెనీని సూచించినందుకు నాకు చీవాట్లు మిగిలాయి. అంతేకాదు మా కంపెనీకి ఓ మంచి ఖాతాదారు దూరమయ్యాడు. నాకో మిత్రుడు తగ్గాడు. ఇంకో పాఠకుడు ఏమన్నాడంటే...

"మీ కథ ఆణిముత్యం. అది చదివింతర్వాత పని గట్టుకుని మీ కథల సంపుటులు కొన్నాను. అవి కూడా చదివింతర్వాత మీరు ఎంత'లోతైన' రచయితో తెలిసింది. మీలాంటి ప్రగతిశీల, అభ్యుదయ రచయితకు రావాల్సినంత గుర్తింపు రాలేదని బాధ కలిగింది. అయినా అధైర్యపడకండి. మీ కృషినిలాగే కొనసాగించండి. రాష్ట్రేతరంలో ఉంటూ, ఫైనాన్స్ రంగంలో పనిచేస్తూ కూడా సాహితీరంగంలో మన మాతృభాషకు

మీరు చేస్తున్న సేవ అనన్యసామాన్యమైనది. మంచి మనసున్న మీరు మరిన్ని విజయాలను సాధించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను.

ఇంకో ముఖ్య విషయం.

మీ ఆధిపత్యంలో మీ విత్తీయ సంస్థ సర్వతోముఖ అభివృద్ధి చెందతోందని తెలిసి సంతోషం కలిగింది. మీ వంటి పేరెన్నికగల సంస్థ గనక మా నగరంలో ఓ శాఖ నెలగొల్పితే మీ వ్యాపారం నెలనెలా ముప్పైకోట్ల డిపాజిట్లు అరవైకోట్లలోన్లుగా వృద్ధి చెందుతుంది. నాకు ఈ రంగంలో ఎంతో అనుభవం ఉంది. ఇక్కడ నాకు మంచి పలుకుబడి కూడా ఉంది. నన్ను ఇక్కడి శాఖాధిపతిగా నియమిస్తే మీరిచ్చిన వ్యాపార లక్ష్యాలు మించి పోగలను. మీ ఈ ప్రోత్సాహంతో నా అర్హత, నైపుణ్యానికి ఊతం వస్తుంది. నాకు జాబ్‌సాటిస్‌ఫాక్షన్ ఉంటుంది. భారమనుకోకుండా నాకీ మాత్రం సహాయం చేయండి. నా బయోడేటా జతపరిచాను. మీ నుండి సానుకూల స్పందనను ఆశిస్తున్నాను. మీ వీరాభిమాని 'స్కామేశ్వర్'."

అతనున్న పట్టణంలో మా బ్రాంచి తెరిచే అవసరం లేకున్నా, ఏదో నా అభిమానికి సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఆ ప్రాంతం సర్వే చేయించాను. దాని ద్వారా తేలిదే మంటే అక్కడి జనాలకు అప్పులు తీసుకుని ఎగనామం పెట్టే అలవాటుంది. దానివల్ల కొన్ని విత్తీయ సంస్థలకు తాళం పడింది. స్కామేశ్వర్‌లాంటి దళారుల నిర్వాకంతో కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేశాయట. వాటికి సంబంధించిన కేసుల్లో స్కామేశ్వర్ మూడుసార్లు శ్రీ కృష్ణ జన్మస్థానం పావనం చేశాడట!

దీనికి మీరేమంటారు?

"శ్రీ ఓటికుండ గారూ! నమస్కారం. 'కథా కచ్చేరిలోని మీ కథ చదివి నా కళ్లకు నీళ్లొచ్చాయి. మాలాంటి బడుగుల వ్యధకు అక్షర రూపాన్నిచ్చిన మీ 'కలా' నైపుణ్యానికి జోహార్లు. మీ చిన్నప్పటి నేపథ్యం. మీరు ఎదుర్కొన్న కష్టాలు మీ పెన్నును గన్నుగా మార్చాయి. ఆ గన్ను నుండి వెలువడిన తూటాలు పాఠకుల హృదయాల్లోకి సూటిగా చొచ్చుకుపోతాయి. వారిని విలవిలలాడేట్టు చేస్తాయి. అది మీ రచనా పాటవానికి పరాకాష్ట. మీలాగే నేను కూడా ఎన్నో ఆటుపోట్లకు లోనయ్యాను. కాకపోతే మీరు అదృష్టవశాత్తు మంచి ఉద్యోగం, హోదాలో ఉన్నారు. నేను మాత్రం ఓ చిరుగుమాస్తాగా భార్య, ఆరుగురు పిల్లలు, రోగిష్టులైన ముసలి తల్లిదండ్రులతో సంసార సాగరాన్ని ఈదలేక చతికిల బడ్డాను. రచయిత నవ్వాలని నాకూ ఉంది. కాని నిత్య కష్టాల నాదినచర్యతో రాయడానికి తగిన వాతావరణం లేదు. ఏవో సమస్యలు నా కలానికి

అడ్డం పడుతున్నాయి. నా జీవితంలోని కొన్ని ఘట్టాలను, నా అనుభవాలను అప్పుడప్పుడు కాగితాలపై పెట్టాను. అవి అలాగే మీకు పంపిస్తున్నాను. వాటిని మీరు ఓ ప్రభావవంతమైన నవలగా మలచగలరనే నమ్మకం నాకుంది. మంచి పరిశీలనా శక్తి గల మీరు మా ఈతిబాధలకు అక్షరం రూపం ఇచ్చి వాటి ద్వారా పాఠకులకు మంచి సందేశం ఇవ్వాలని కోరుతున్నాను. ఆ నవలకు మీ పేరే పెట్టినా, కథా సహకారకర్తగా నా పేరు కూడా ఇస్తే సంతోషిస్తాను. మీరు గనక నా జీవితాన్ని లోకానికి చాటితే ముమ్ముందు మీ కీర్తి అన్ని దిక్కులా వ్యాపిస్తుంది. ఎన్నో కథలకు సరిపడ ఇతివృత్తాలు నా దగ్గరింకా ఉన్నాయి. వాటిని తర్వాత పంపిస్తాను. ఇట్లు మీ 'ఫాన్' కుచేలుడు."

ముప్ఫై పేజీల కాగితాల సోది చదివేసరికి నా బుర్ర గిర్రుమని తిరిగింది. అతని సొంత డబ్బా చప్పుడికి నా మెదడు మొద్దుబారిపోయింది. సెల్ఫ్‌పిటీతో నిండిన ఆ చిత్తుకాగితాల బొత్తి నాలో వెగటు పుట్టించింది. ఉద్యోగ నిర్వహణలో అతని ఉత్సాకత ఎంతుందో కాని ఆరుగురుపిల్లలను ఈ లోకం మీదకు తెచ్చిన అతని విచక్షణకు ఓ నమస్కారం పెట్టి, తలకు అమృతాంజనం పట్టించి నిద్రకు ఉపక్రమించాను.

నా కష్టాలు ఇంతటితో తీరలేదు. ఇంకో పాఠకుడు నన్నెలా ములగ చెట్టెక్కించాడో చదవండి.

"ప్రసిద్ధ కథక చక్రవర్తి గారికి నమస్సులు. ఇంతకు క్రితం మీ కథా సంపుటం సమీక్ష చేసినప్పుడు మీ పరిచయం చూసి మీరో బూర్జువాజాతికి చెందిన వారనుకున్నాను. మీ డిగ్రీలు, ఉద్యోగం, హోదా కథల్లో మీరుటంకించిన బెంజిలు, హోండాకార్లు, భవ్యమైన దివ్యమైన హోటల్లోని పార్టీ సన్నివేశాలు, ఇవన్నీ చదివి మీరునోట్లో బంగారు చెమ్చాతో పుట్టారనుకున్నాను. కాని 'కథాకచ్చేరి' లోని మీ కథ, మీ జీవిత నేపథ్యం చదివి అవాక్కయ్యాను. ఎన్నో జీవిత సత్యాలను సాధికారంగా పాఠకుల ముందు ఆవిష్కరించారు. మాలాంటి అట్టడుగు వర్గాల వారు జీవన యానంలో అనుదినం అనుభవించే నరకాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించారు. అందుకే సామాన్య పాఠకుల నాకట్టుకున్న కథ అది. మా ప్రతినిధి ఐనమీరే మా శోషణను ఆరికట్టగల సమర్థులనే నిర్ణయానికొచ్చాను.

నేను డిగ్రీ చేశాను. ఉద్యోగానికై కాళ్ళరిగేలా తిరిగి తిరిగి చివరకు రైతు బజార్లో కూలీగా చేస్తున్నాను. రైతుల పేరుతో వ్యాపారం చేసే బినామీదార్లు మా శ్రమను కొల్లగొడుతున్నారు.

రోజుకి వంద రూపాయల కూలీకి సంతకం తీసుకుని అరవై రూపాయలే చేతిలో పెడుతున్నారు. అదేమని ఎదిరించిన వారిని పనిలోంచి తీసేస్తున్నారు. ఏవో నాలుగు మెతుకులు నోట్లోకి పోతున్నాయి గదా అని మిన్నకున్నాను.

అలాగే ధరల పట్టిక ప్రకారం కాకుండా ఎక్కువ ధరకు సరుకులమ్ముతూ సామాన్య ప్రజలను కూడా మోసం చేస్తున్నారు. కార్మికుల శ్రమ దోపిడీ చేసే ఈ మేకవన్నె పులుల బండారం బయటపెడుతూ ఓ మంచి కథ రాయండి. మా శ్రమ జీవుల వ్యధను లోకానికి చాటి మీ ఆశ్రితజన పక్షపాతాన్ని నిరూపించుకోండి.

లాల్ సలాంతో మీ..... వామకరం"

ఎన్నో కార్మిక సంఘాలు, పార్టీలు ఉన్న ఆ నగరంలోని వారు చేయలేని దాన్ని పరరాష్ట్రంలో ఉన్న నేను ఎలా చేయగలను? అయినా కథల రాళ్ళకు కష్టాల చింతకాయలు రాలుతాయా?

ఇంకో ప్రబుద్ధుడు ఏం సెలవిచ్చాడో అవధరించండి.

"మీ బహుమతి కథ చదివిచలించి పోయాను. మీ జీవిత విశేషాలు చదివి మీరు కళాభిమాని కూడా అని తెలిసింది. పరరాష్ట్రంలో మన సాహిత్యాన్ని సంస్కృతిని, కళలను పరిరక్షిస్తున్నందుకు అభినందనలు. మీ అంత ఎత్తులో కాక పోయినా నేనూ ఓ చిన్నపాటి కళాకారుణ్ణి. పరిషత్తు నాటకాల్లో ఎన్నో బహుమతులు పొందాను. అయినా లాభమేమిటి? నాటకాలతో పొట్టనిండదు కదా? నా జీవితం కళకే అంకితం చేయాలని ఉంది. జీవన భృతికై ఇష్టంలేని పని చేసి నా కళాతృష్ణను చంపుకోలేను.

మీరుండే ప్రాంతంలో నాటకాలకు మంచి ఆదరణ ఉందని ఎందరో కళాకారులు నటననే వృత్తిగా జీవిస్తున్నారని విన్నాను. చెప్పకూడదు గానీ నేను, యద్దనపూడి గారి రాజశేఖరంలా ఉంటానని మిత్రులంటుంటారు. మీ ప్రాంతపు భాషలో కూడా నాకు మంచి ప్రావీణ్యం ఉంది. నాకు అక్కడి డ్రామాట్రూపులో చోటు కల్పించండి. నిరంతరం కళాసేవ చేసే భాగ్యం కల్గించండి. మీ చలవతో ముమ్ముందు సినీరంగంలో ప్రవేశించాలని నా ఆశయం. నన్ను నిరాశపరచరని ఆశిస్తూ మీకు కళాంజలి. మీ... మేరానామ్ జోకర్."

ఇంకో అభిమాని నానుండి ఏమాశిస్తున్నాడో చూడండి.

"ప్రముఖ కథా రచయిత గారికి ప్రణామములు. మీరు రాతల వీరులైతే నేను గీతల శూరుణ్ణి. నాకార్టూన్లు ఎన్నో పత్రికల్లో వచ్చాయి. చిత్రాలు కూడా పత్రికల ముఖచిత్రాలుగా ప్రచురింపబడ్డాయి. మీరు చూసే ఉంటారు. మీరు ప్రోత్కర్ష

అనుకోకపోతే, నేనో గొప్ప చిత్రకారుణ్ణి. మన రాష్ట్రంలో తగిన ప్రోత్సాహంలేక మరుగున పడ్డ మాణిక్యాణ్ణి. మీలాంటి కళాపిపాసులు పూనుకుంటే నేను వెలుగులోకి వస్తాను. ఆ మధ్య మీ నగరంలోని ఓ వ్యాపారవేత్త అక్కడి ప్రసిద్ధ చిత్రకారునితో వందకోట్ల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నాడని వార్తల్లో చూశాను. ఆ పారిశ్రామికవేత్తకు మీ సంస్థతో లావాదేవీలు ఉన్నాయని తెలిసింది. మీరంటే ఆయనకు గౌరవం అని కూడా విన్నాను. ఓ పెద్ద ఆర్థిక సంస్థలో ఉన్నత పదవిలో ఉన్న మీరు దయచేసి నా గురించి ఆ వ్యాపారవేత్త చెవిన వేస్తే నా జీవితం ధన్యమౌతుంది. మీ మాటసాయం నా జీవన గమనాన్నే మారుస్తుంది. మీకు మొహమాటంగా ఉంటే వారి చిరునామా రాయండి. నేను మీ పేరు చెప్పి పరిచయం చేసుకుంటాను. ఆ తర్వాత మీరు ఓ మాట చెబుదురుగానీ. సాటి కళాకారునికి ఈ మాత్రం సహాయం చేస్తారు కదూ?

ఇట్లు.... మీ స్నేహాభిలాషి... పిచ్చి గీతల పిచ్చయ్య."

అతని కార్టూన్లు గానీ, చిత్రాలుగానీ ఎక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు. కాని తనో ఎం.ఎఫ్. హుస్సేన్ అనుకుంటున్నాడు!

ఏమండీ! నా 'అభిమాను'ల స్పందనకు అసూయపడుతున్నారా? లేక నా ఈ అవస్థ గమనించి జాలిపడుతున్నారా ? ఏది ఏమైనా మిమ్మల్ని ఇంతటితో వదలను. నా బాధంతా మీరూ పంచుకోవాల్సిందే. నా అభిమానులకు నేను దొరికినట్టుగా మీరు నాకు చిక్కారు. అనుభవించండిక!

"శ్రీ.... గారూ! మీ కథ అమోఘం. ప్రవాసాంధ్రులైన మీరు మన భాషను పనిగట్టుకుని నేర్చి, కథలు కూడా రాయగలిగే స్థితికెదిగారంటే, అది మామూలు విషయం కాదు. మీ నగరంలోని తెలుగు సంఘంవారు మన రాష్ట్రం నుండి సాహితీవేత్తలను, కళాకారులను ఆహ్వానించి వారిని సముచిత రీతిలో సన్మానించడం పత్రికల ద్వారా చూస్తున్నాం. ఈ మధ్య మీరు ఫలానా పండితున్ని పిలిపించి సాహిత్య గోష్టి నిర్వహించినట్లు తెలిసింది. సంతోషం. కానీ అతను నాకంటే చాలా జూనియర్. నేను రాసిన దాంట్లో సగం పుస్తకాలు కూడా అతను ప్రచురించలేదు. నేను చేసిన వ్యాఖ్యానాల్లో పదోవంతు కూడా అతను చేయలేదు. అతని వయసు నా సర్వీసంత లేదు. నాలాంటి వాణ్ణి ప్రక్కన బెట్టి నిన్న మొన్నటి కుర్రవాళ్ళను సన్మానించడం ఏం బాగాలేదు. మీరు నా చిరకాల మిత్రులై ఉండీ, నా సాహితీ పటిమనెరిగినవారై ఉండీ, నన్ను పిలిపించక పోవడం శోచనీయం. మీలాంటి సాహితీప్రియులు కూడా

మాలాంటి సంస్కృతాంధ్ర పండితులను, విద్యావేత్తలను ఉపేక్షించడం వల్లే మన సాహిత్యానికి తగిన గుర్తింపురాలేదు. తెలుగు ప్రాచీన హోదాకై కూడా కేంద్రంతో పోట్లాడ వలసి వచ్చింది. కన్నడ భాషకు ఆరు జ్ఞానపీఠాలు వస్తే మనకు ఇంతవరకు రెండే వచ్చాయి.

ఇప్పటికైనా మీ ధోరణి మార్చుకుని మమ్మల్ని మీ ఊరుకి ఆహ్వానించండి. మా పాండిత్యాన్ని అక్కడి వారికి పరిచయం చేయండి. మా ప్రసంగాన్ని ఒక్కసారి వింటే మీరే మమ్మల్ని మళ్ళీ మళ్ళీ పిలుస్తారు. మాకిక్కడ ఊపిరి సలపనంత పని ఉన్నా, ఏదో మీకు కూడా మమ్మల్ని గౌరవించే అవకాశం కల్పిద్దామనే ఉద్దేశ్యంతో రాస్తున్నాము. మంచి సాహిత్య గోష్టి ఏర్పాటు చేసిన పేరు దక్కించుకోండి. మరో విషయం, రాష్ట్రం ఆవల మేము విమానాల్లోనే ప్రయాణిస్తాం. మా సమయం అమూల్యం గదా! అయిదు వేల రూపాయల పారితోషికం, స్టార్ హోటల్లో మూడు రోజులు బస ఏర్పాటు చేస్తే చాలు. ఓ రోజు ఎ.సి. కార్లో మీ సిటీ అంతా చూపించాలి. ఈ విషయాలు మీ సంస్థ కార్యవర్గానికి తెలిపి, నన్ను మీ ఊరికి పిలిపించి, విలువైన జ్ఞాపిక, శాలువా, అయిదువేల నూటపదార్లతో ఘనంగా సత్కరించి ధన్యులు కాగలరని దీవిస్తున్నాము. ఇట్లు..... మీ కనక శునకం."

అతని క్లాసులో విద్యార్థులే ఉండరు. అధవా ఒకటీ, అరా ఉన్నా వారు గుర్రు పెట్టి మరీ నిద్ర పోతుంటారు. అలాంటి వాణ్ణి పిలిపిస్తే ఇక్కడి వారు నాతాట తీయరూ? పైగా అతని గొంతెమ్మ కోరికలు ఏకరువు పెట్టానంటే నన్ను కమిటీ నుండి కూడా తరిమేస్తారు. ఇవన్నీ ఆయన బుర్రలోకెలా ఎక్కించాలి? వారితో ఎంతోకొంత పరిచయం ఉన్నందుకు ఇలాంటి నిష్ఠూరాలు భరించక తప్పదు మరి!

ఇంకా ఓ పత్రికాధిపతి గారు ఏం సెలవిచ్చారో చూడండి.

"శ్రీ.... గారూ! మీ వంటి లబ్ధప్రతిష్టితులైన రచయితలు అంత చిన్న పత్రిక వారి పోటీలో పాల్గొనడం విచారకరం.

మీలాంటి చేయి తిరిగిన రచయితల కొరకే మేము 'కథాకవ్వం' పత్రికను వెలువరిస్తున్నాము. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, మంచి సాహితీ ప్రమాణాలతో ప్రచురించే పత్రికలకు పాఠకుల ఆదరణ లేదు. సరే, కాని మీవంటి ప్రముఖ రచయితలు కూడా అంటీ, అంటనట్టుంటే ఎలా? సరస కథలు, వెకిలి కథలు ప్రచురించే పత్రికలకున్న ప్రాచుర్యం మావంటి ఉన్నతస్థాయి పత్రికలకు లభించక పోవడం శోచనీయం. దానికి కారణం మీ నిష్క్రియతే. వేలసంఖ్యలో ఉన్న తెలుగు

రచయితలు, ఒక్కొక్కరు వంద చందాదారుల్ని చేర్చినా, మా సర్క్యులేషన్ లక్షకు చేరుతుంది. ఒక్కో రచయిత సంవత్సరానికో ప్రకటన సేకరించినా మా మనుగడకు ఢోకా ఉండదు. మీ నగరంలోని తెలుగువారి సంఖ్య పది లక్షలపై మాటే అని విన్నాము. మీవంతుగా మాకు వేయి చందాదార్లని చేర్పించండి. మీకు మంచి గుర్తింపు తీసుకొస్తాము. మీ మీద ఓ ప్రత్యేక సంచిక వేస్తాము. సాహితీ పురస్కారాలు వచ్చేట్టు ఏర్పాటు చేస్తాము. మాకు సహకరించని పక్షంలో మీ రచనలను, మిమ్మల్ని మా 'కవ్వం'లో మథించి, చీల్చి చెండాడుతామని గమనించండి. ఇలా రాశామని ఎవరితో చెప్పకుండా, మేము చెప్పినట్టు చేయండి. అది ఉభయతారకంగా ఉంటుంది. ఇట్లు.... గండర గండడు, ఎడిటర్ కథాకవ్వం."

ఎనిమిది కోట్ల జనాభా వున్న మన రాష్ట్రంలోనే సర్క్యులేషన్ వేయికి మించని పత్రికలెన్నో? కుత్సితాలు, కుతంత్రాలతో నిండిన జీడిపాకం సీరియల్సుండగా పత్రిక కొనడం ఎందుకు? ఇలాంటి సందర్భంలో ఈయన గారికి పరాయి రాష్ట్రం నుండి వేయి మందిని చందాదారులుగా చేర్చాలట! ప్రతి నాలుగో వాడు ఓ పత్రిక పెట్టడం, ఇండియా టుడే లెవల్లో సర్క్యులేషన్ పెరిగి లక్షల్లో ప్రకటనలు రావాలనుకోవడం పరిపాటైపోయింది. కొన్ని రోజులు చేతులు కాల్చుకుని, ఆ తర్వాత ఆకులు పట్టుకోవడం మామూలైపోయింది.

మరో అతను నన్నెంత చులకన చేశాడో చదవండి.

"మీ కథ కచ్చేరి కథ చాలా బావుంది. మీ కథలు ఎప్పుడు ఎక్కడ ప్రచురింపబడినా నాకు తెలపండి. పనిగట్టుకుని గ్రంథాలయానికి వెళ్ళి మరీ చదువుతాను. శ్రమ అనుకోకుండా నాకో చిన్న సహాయం చేయండి. మా అబ్బాయికి మీసిటీలో వ్రాత పరీక్ష ఉంది. ఫలానా తేదీన ఫలానా రైల్లో వస్తున్నాడు. దయచేసి వాడిని రిసీవ్ చేసుకుని, బస ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రానికి తీసికెళ్ళే ఏర్పాటు చేయండి. పరీక్ష అయిన మర్నాడు పనిలో పనిగా ఎవరినైనా ఇచ్చి సైట్ సీయింగ్ కూడా చేయించండి. జీవితాంతం మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటాడు. అక్కడి ఏర్పాట్లు చేసినట్టుగా ఫోన్ చేయండి. ఇట్లు.... మీ పరాన్నబుక్కు."

ఇకపోతే కథా సంపుటాలు కాంప్లిమెంటరీగా పంపమన్న వారికి లెక్కే లేదు. సొంత ఖర్చు పెట్టుకుని వేయి కాపీలు వేయిస్తే, ముప్పాతిక శాతం కాంప్లిమెంటరీలకే పోయాయి. మిగతా పావు శాతం పుస్తక కేంద్రాల్లో గత నాలుగు సంవత్సరాల నుంచి మూలుగుతున్నాయి. దానికి లెక్క పంపిన నాథుడు లేదు. పైగా పోస్టేజి, కొరియర్ ఛార్జీలకు ఘరింత చమురు వదిలింది.

అప్పుడే ఆవలింతలా? ఇంకొక్క ఉత్తరం ఉటంకించి మిమ్మల్ని విడుదల చేస్తాను. చిత్తగించండి.

"ఆర్యా.... మీ కథలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. మీరు నేల మీదే సాము చేస్తారు. అందుకే సామాన్యుల హృదయాల్ని కొల్లగొడతారు. అలాంటి మీకు సముచిత సత్కారం ఏర్పాటు చేయాలని మా సంస్థ నిర్ణయించింది. మీ గురించి, మీ కథల గురించి వ్యాఖ్యానించడానికి ప్రముఖ రచయితలతో సంప్రదింపులు జరిపాము. వారిలో కొందరు మీ కథలన్నీ చదవలేదని సెలవిచ్చారు.

వారి సౌకర్యార్థం మీ అన్ని కథాసంపుటుల పదేసి కాపీలు, మా సంస్థ చిరునామాకు కొరియర్ ద్వారా పంపండి. వచ్చే కార్మిక దిన సందర్భంగా పెద్ద సమావేశం ఏర్పాటు చేసి, మీరు జీవితంలో మరిచిపోలేని అనుభూతిని కలుగజేస్తాం. పెద్ద పదవిలో ఉన్న మీకు సభాఖర్చులకు గాను మీ వంతుగా పాతికవేల రూపాయల విరాళం ఏర్పాటు చేయడం సమస్య కాదనుకుంటాము. మీ వంటి నిజాయితీగల రచయితను సన్మానించే భాగ్యాన్ని మాకు కలుగజేయండి. మీ సంపుటాలు, విరాళం డ్రాఫ్టు కొరకు వేయి కన్నులతో ఎదురు చూస్తూ మీ.... భజనారావు, కార్యదర్శి - భజంత్రీసమాఖ్య."

ఇక నా మనఃస్థితినర్థం చేసుకోండి. ఎంతైనా తెలుగు రచయితను గదా! కీర్తి తామర అంత తొందరగా వదులుతుందా?

ఆ 'సమాఖ్య' వివరాలు కనుక్కోమని, అదే ఊళ్ళో ఉన్న ఓ రచయిత మిత్రునికి రాశాను. అతను వెంటనే ఫోన్ చేశాడు. ఆ సంస్థ, ఆ కార్యదర్శి, అంతా మోసమట, రచయితల బలహీనతను ఆసరా చేసుకుని వారి నుండి పుస్తకాలు తెప్పించుకుని అమ్ముకుంటాడట! (నాకు తెలీకడుగుతాను, తెలుగు పుస్తకాలు కొనే తెలుగు వాళ్ళున్నారా?) చాలా మందిని ఇలాగే ట్రాప్ చేసి డబ్బు గుంజాడట.

జనాలకి రచయితలు ఎంత లోకువో!

నాణేనికింకో వైపు కొంత మంది సీరియస్ పాఠకులు ఏమీ ఆశించకుండా తమ అభిప్రాయాలు తెలిపారు. నా కథలోని లొసుగులను ఎత్తి చూపారు. సూచనలు కూడా చేశారు. వారి కోసమైనా నేనింకా రాస్తాను. కథల పోటీల్లో పాల్గొంటాను. తప్పిపోయి బహుమతి గాని వస్తే "నాకు కథకు బహుమతొచ్చిందండోయ్" అని గొంతు చించుకుని అరుస్తాను కానీ, ఫోన్ నెంబర్, చిరునామా ఇవ్వనుగాక ఇవ్వను.